
క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసీ పూజ..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు

డాబాగార్డెన్స్: ప్రజల వినతులు, అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం నిర్వహించారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. అందిన 16 వినతుల్లో జోన్–1 నుంచి ఒకటి, జోన్–2 నుంచి ఒకటి, జోన్–3 నుంచి ఒకటి, జోన్–4 నుంచి రెండు, జోన్–5 నుంచి తొమ్మిది, జోన్–7 నుంచి రెండు వినతులు వచ్చాయి. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు ప్రతి శుక్రవారం నమోదు చేసుకోవచ్చని చీఫ్ సిటీ ప్లానర్ తెలిపారు. కార్యక్రమంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు తార్కాణమే 'స్పెక్ట్రమ్'

విశాఖ విద్య: విద్యార్థుల అద్భుత ప్రతిభకు తార్కాణంగా 'స్పెక్ట్రమ్' ప్రదర్శన నిలిచిందని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ విద్యార్థుల వార్షిక చిత్రకళా ప్రదర్శన స్పెక్ట్రమ్– 2025ను శుక్రవారం వీసీ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, చిత్రాలు ఆయన తిలకించి అభినందించారు. విద్యార్థులు తమ అద్భుత ప్రతిభతో కళాఖండాలను తీర్చిదిద్దారని ప్రశంసించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిత్రకళా విభాగం విద్యార్థులను భాగస్వాములు చేస్తూ ఒక ప్రత్యేక ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, చిత్రాలను నిశితంగా పరిశీలించి.. వాటి వెనుక ఉన్న భావాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

'కర్మయోగి' పుస్తకావిష్కరణ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఐపీఏ వేదికగా శుక్రవారం కర్మయోగి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విశాఖపట్నం శాఖ, ఆల్వార్‌దాస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐపీఏ ఏపీ రీజనల్ బ్రాంచ్ చైర్మన్, మాజీ ఐఏఎస్ ఎం.గోపాలకృష్ణ లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి పుస్తకాన్ని రచించారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ ఈఏఎస్ శర్మ, మాజీ డీజీపీ నండూరి సాంబశివరావు, యూపీఎస్సీ మాజీ సభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ కార్యాలయం



పాత పోస్టాఫీసు

నాడు రాజసం.. నేడు నిస్తేజం

- నాడు కళకళలాడిన కొన్ని నిర్మాణాలు
- నేడు ఆదరణ కోల్పోతున్న వైనం
- ఆయా కట్టడాల ప్రాభవాన్ని కాపాడాలని పలువురి వినతి

జగదాంబ: ఒకప్పుడు కళకళలాడిన పాతనగరంలోని పలు చారిత్రాత్మక కట్టడాలు నేడు వెలవెలబోతున్నాయి. విశాఖపట్నంలో ఒకప్పుడు పాతనగరమే పెద్ద టౌన్‌గా ప్రసిద్ధి పొందింది. వెనుకటికి పాతనగరమే విశాఖపట్నం. అటువంటిది నేడు ఎంవీపీ, మద్దిలపాలెం, సీతమ్మధార, ఎండాడ, మధురవాడ వంటి ప్రాంతాలు పోష్ లుక్‌తో విశాఖ నగర రూపురేఖలు మారిపోయాయి. కానీ పాతనగరంలో కొన్ని కట్టడాలు ఇప్పటికీ తమ ఉనికి కోల్పోలేదు. నాటి ప్రాభవానికి గుర్తుగా మౌనంగా దర్శనమిస్తున్నాయి.

పాతనగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం..

ఒకప్పుడు తగరపువలస నుంచి విశాఖపట్నం ప్రాంతానికి చెందిన వ్యవహారాలకు సంబంధించి పాతనగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్లు జరిగేవి. ఈ కారణంగా విశాఖలోని ఏ ప్రాంతంలోని వారైనా రిజిస్ట్రేషన్ పనుల కోసం తప్పనిసరిగా ఇక్కడికే వచ్చేవారు. దీంతో ఈ కార్యాలయం ఎప్పుడు చూసినా జనంతో సందడిగా ఉండేది. ఈ కార్యాలయం ఉండడం వల్ల దీనికి సమీపంలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో దస్తావేజు లేఖకులు, టీ, బిస్కెట్లు, సమోసా, భోజనం విక్రయించే దుకాణాలతో ఈ ప్రాంతం తిరనాళ్లను తలపించేది. తర్వాతి కాలంలో నగరం అభివృద్ధి చెందింది. పలు చోట్ల రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పెట్టడం వల్ల నేడు పాతనగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది.



టర్నర్ చౌల్ట్రీ

టర్నర్ చౌల్ట్రీ..

ఇది విశాఖలోని దక్షిణ జోన్‌లో గల పెద్దాస్పత్రి అయిన కేజీహెచ్‌కు కాస్త దూరంలో ఉంటుంది. కేజీహెచ్‌కు దూరాభారం నుంచి వచ్చే రోగులు, వారి సహాయకులకు విడిది చేసేందుకు ఉపయోగపడేది. వ్యాధులు నయమయ్యే వరకు రోగులు ఆస్పత్రిలో ఉంటే వారి సహాయకులు టర్నర్ సత్రంలో తలదాచుకుని తిరిగి తమతమ నెలవులకు వెళ్లే వారని పెద్ద వయసు వారు చెబుతుంటారు.

సీబీఎం స్కూల్..

విశాఖపట్నంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో రిటైర్ అయిన వారు, చదువుకున్న అరవై ఏళ్లు దాటిన వారు ఎవరన్నా ఉన్నారంటే వారిలో చాలా మంది పాతనగరంలోని సీబీఎం పాఠశాలలో చదివిన వారే అయి ఉంటారు. ఎందుకంటే కొన్ని దశాబ్దాల క్రితం ఈ పాఠశాలే విద్యార్థులకు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ఇది ఎలాంటి మరమ్మతులకు నోచుకోకుండా తన ఉనికి కోల్పోయే ప్రమాదంలో ఉంది.



సీబీఎం పాఠశాల

పాత పోస్టాఫీసు..

విశాఖలో ఈ పేరు వినని వారుండరు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాంతం.. పేరు ఇది. నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల బస్సు సర్వీసులు ఇక్కడికే చేరుకుంటాయి. వన్‌టౌన్‌లోని చివరి ప్రాంతమైన ఈ ఏరియాలోని పాతపోస్టాఫీసు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదనే చెప్పాలి.

అవగాహనతోనే వ్యాధులకు చెక్

జోన్–4 కమిషనర్ మల్లయ్యనాయుడు



జగదాంబ: వేసవి దాదాపు ముగుస్తోంది. ఇక వచ్చేది వర్షాకాలం. వ్యాధులు మోసుకొచ్చే కాలం. దాదాపు అన్నీ మురికివాడలే ఉండే పాతనగర ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన సీజన్ ఇది. అయితే ముందస్తు చర్యలతో అటువంటి ప్రమాదాన్ని తప్పించుకోవచ్చని జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు పేర్కొంటున్నారు. ఆయన సాక్షికి చెప్పిన వివరాలు..

ప్రశ్న : వ్యాధులపై ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు?

జవాబు : కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆదేశాల మేరకు వార్డుల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు వీధి నాటకాలు, కళా జాతల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఆటోల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నాం. మలేరియా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నీళ్ల నిల్వ ఉండరాదని, పాత టైర్లు, కొబ్బరి బొండాలు ఇంటి పరిసరాల్లో ఉండకూడదని అవగాహన కల్పిస్తున్నారు.

ప్రశ్న : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : మురుగు కాలువలు, గెడ్డలు శుభ్రం చేయిస్తున్నాం. ఎక్కడ నీటి ప్రవాహం ఆగిపోతుందో ఆక్కడ పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తున్నాం. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న : యాంటీలార్వా ఆపరేషన్ ఎలా చేస్తారు?

జవాబు : ఎక్కడైతే నీరు నిల్వ ఉంటుందో అక్కడ యాంటీ లార్వా ఆపరేషన్ చేసి దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపడుతున్నాం. ఇంట్లోని ఫ్రిజ్ వెనుక భాగంలో నీరు నిల్వ ఉంటుంది. అలాగే వాడుకునే నీటి డ్రమ్ముల్లో కూడా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. కాబట్టి అలాంటి చోట యాంటీ లార్వా ఆపరేషన్ చేయిస్తాం. ఇందు కోసం ప్రత్యేకంగా మలేరియా సిబ్బంది బృందాలుగా ఏర్పడి వార్డుల్లో ప్రతి ఇంటికి వెళ్లి యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తారు. వర్షాలు కురుస్తుండడంతో వీధుల్లో గంతలు ఉన్న చోట దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న : మురికివాడలు ఎక్కువగా ఉన్న జోన్–4లో పారిశుధ్యంపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : ప్రత్యేకంగా వార్డులకు ఏఎన్ఎంలను నియమిస్తాం. ఎవరికైనా జ్వరం వచ్చే సూచనలు ఉంటే వారిచ్చిన సమాచారం మేరకు వెంటనే సమీపంలోఉన్న ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించి మందులిస్తాం. వీధుల్లో బ్లీచింగ్ చల్లడం, వైద్య శిబిరాల నిర్వహణతో ఇతరులకు వ్యాధులు సోకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : వ్యాధుల బారి నుంచి రక్షణ కోసం ప్రజలకు మీరిచ్చే సలహా ఏమిటి?

జవాబు : ఎవరికి చిన్నపాటి జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయొద్దు. అందుబాటులో ఉన్న ఏఎన్ఎంలకు విషయం తెలియజేయాలి. దగ్గరలోని ఆస్పత్రులకు వెళ్లి క్రమం తప్పకుండా మందులు వాడాలి. డెంగ్యూ అయితే ప్లేట్‌లెట్స్ తగ్గకుండా ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి.

రేపు తొట్లకొండపై యోగాంధ్ర

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం తొట్లకొండలో 'యోగాంధ్ర' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 6.30 నుంచి 8 గంటల మధ్య యోగాసనాలు వేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేవీ, స్వయం సహాయక బృందాల సభ్యులు, వివిధ యోగా సంఘాల సభ్యులు, జిల్లా అధికారులు సహా సుమారు వెయ్యి మంది పాల్గొంటారు. జిల్లా పర్యాటక శాఖాధికారి నేతృత్వంలో యోగాంధ్ర వేడుకలు నిర్వహించాలని, మిగిలిన శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలని, సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ శుక్రవారం సాయంత్రం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

మత్స్యకారుల జాతరోత్సవానికి వాసుపల్లి చేయూత



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర మత్స్యకారుల జాతరోత్సవానికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.20 వేల విరాళం అందజేశారు. ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో శుక్రవారం మత్స్య పారిశ్రామికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ చింతపల్లి పోతురాజు(పులి), ఉపాధ్యక్షుడు కాసారపు వెంకటేశ్వరరావు, పలువురు సంఘం సభ్యులు వాసుపల్లిని కలిసి పండగ ఆహ్వాన పత్రిక అందజేశారు. మత్స్యకారులంటే ప్రత్యేక మమకారం చూపించే వాసుపల్లి గణేష్‌కుమార్ ఎప్పటిలాగే రూ.20 వేల సొంత నిధులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలమాంబ, భూలోకమాత, కొత్తమాంబ అమ్మవార్ల వార్షిక, త్రైవార్షిక మహోత్సవాలు ప్రతి ఏటా వైభవంగా నిర్వహిస్తారన్నారు. తమ జాలరి కులం ఇక్కడి స్థానిక అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. గంగ పుత్రులుగా సముద్రంలో వేటకు వెళ్తూ ప్రాణాలు పణంగా పెట్టి జీవనం సాగించే తమ బతుకులు గాలిలో దీపం అని చెప్పారు. అటువంటి మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అందించే మత్స్యకార భరోసాలో కూడా 50 శాతం మంది అర్హులకు ఇవ్వకుండా మొండి చేయి చూపిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మత్స్యకారులకు భరోసా కల్పించి, కాలిపోయిన బోట్లకు కోట్లాది రూపాయల నష్టపరిహారం ఇచ్చి ఆదుకున్నారన్నారు. మత్స్యకారులంటే చిన్నచూపు చూసే చంద్రబాబు మత్స్య పారిశ్రామికుల జీవితాలతో ఆట్లాడుకోవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణ గీతాలతో సినీ సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు తదితరులు

డాబాగార్డెన్స్: దివంగత సినీనటుడు, సూపర్‌స్టార్ కృష్ణ 60 వసంతాల సినీ వజ్రోత్సవంలో భాగంగా 82వ జయంతిని పురస్కరించుకుని శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సూపర్ స్టార్ కృష్ణ పేరిట ప్రత్యేక సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు పల్లవి మ్యూజిక్ సంస్థ అధినేత పల్లా బాబ్జి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయ ప్రాంగణంలో సినీ సంగీత విభావరి పోస్టర్‌ను ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో కళాకారులు, సూపర్ స్టార్ కృష్ణ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, డాక్టర్ టి. కుమార్‌రాజు, లక్ష్మీ స్వరూప, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న ఆలయాలే టార్గెట్


- గుడుల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏడీసీపీ మోహన్‌రావు

అల్లిపురం: ఆలయాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆకోజు బ్రహ్మజీ అనే వ్యక్తిని వన్‌టౌన్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి సుమారు 2,900 గ్రాముల వెండి, 7.6 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం ఏడీసీపీ మోహన్‌రావు వివరాలు వెల్లడించారు. అల్లిపురం, సింహాలదేవిడికి చెందిన చెందిన బ్రహ్మజీ ఈ నెల 19న టౌన్ కొత్తరోడ్డులోని దుర్గమ్మ గుడిలో పూజారిగా పని చేస్తానని వెళ్లాడు. నిర్వాహకులు సకల సూర్యారావు దంపతులు అతన్ని నమ్మి పూజ బాధ్యతలు అప్పగించారు. పూజకు కావాల్సిన వస్తువులు తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్లిన వారు తిరిగి వచ్చే సరికి అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటం, హస్తం, చెవి ఆభరణాలతో ఉడాయించాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న వన్‌టౌన్ క్రైం పోలీసులు.. హార్బర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసు పర్యవేక్షణలో విచారణ చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి.. శుక్రవారం కురుపాం మార్కెట్ జంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మొత్తం 10 నేరాలకు సంబంధించిన సుమారు 2,900 గ్రాముల వెండి వస్తువులు, 7.6 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో బ్రహ్మజీ ఒంటరిగా జీవిస్తున్నాడని, ఆర్థిక ఇబ్బందుల కారణంగానే దొంగతనాలకు పాల్పడుతున్నాడని తేలింది. భార్య, కుమారుడు అతన్ని వదిలేశారు. వయసు కారణంగా వేరే పనులు చేసుకోలేని బ్రహ్మజీ చిన్న ఆలయాల్లో ఆభరణాలు దొంగలించి, రోజువారీ అవసరాలు తీర్చుకుంటున్నాడు. అతను గతంలోనూ వన్‌టౌన్, పెందుర్తి, కంచరపాలెం, మల్కాపురం, చోడవరం, భీమిలీ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సమావేశంలో హార్బర్ సబ్ డివిజన్ క్రైం సీఐ జి.శ్రీనివాసరావు, వన్‌టౌన్ క్రైం ఎస్ఐ ఎస్.రామమూర్తి, ఎస్ఐ ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన నర్సుకు సన్మానం



హెడ్ నర్సు శారదాంబను సన్మానిస్తున్న డాక్టర్ శివానంద్ తదితరులు

మహారాణిపేట: పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా జీవించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. శుక్రవారం క్లాక్ రూమ్‌లో 38 సంవత్సరాల పాటు కేజీహెచ్‌లో స్టాఫ్ నర్సుగా పని చేసి పదవీ విరమణ చేసిన వై.శారదాంబ రిటైర్‌మెంట్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శారదాంబను సన్మానించారు. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్ కుమార్, ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ టి.షారోన్‌రాజు, ఏఆర్ఎంవో డాక్టర్ బి.రాజేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, కల్పన మౌళి, సుగీత స్వర్ణలత, ప్రభుత్వ నర్సుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి, ఎస్.జి.గౌరీ, పద్మజ, శాంతి పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన

- రోడ్లు జలమయం
- రాకపోకలకు ఇబ్బంది పడ్డ పాదచారులు, వాహన చోదకులు



వర్షం నీటితో నదిని తలపిస్తున్న స్ప్రింగ్‌రోడ్డు



వర్షం నీటిలో జనతా బజార్ రహదారి



వన్‌టౌన్ ప్రధాన రహదారిలో వర్షం నీరు

జగదాంబ: శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పాతనగంలోని పలు రోడ్లు నీట మునిగాయి. ఉదయం నుంచి మేఘావృతంగా ఉన్న ఆకాశం సాయంత్రం ఒక్కసారిగా వర్షించింది. దీంతో జీవీఎంసీ 35వ వార్డు స్ప్రింగ్‌రోడ్డులో ద్విచక్ర వాహన చోదకులు ప్రయాణించేందుకు ఇబ్బంది పడ్డారు. వన్‌టౌన్ ప్రధాన రహదారిలో వర్షం నీరు రహదారిపై నిలిచిపోయింది. అలాగే పోర్టుకు వెళ్లే రహదారి కూడా నీట మునిగిపోయింది. దీంతో కొద్దిసేపు జనజీవనం స్తంభించిపోయింది. కొంత సమయానికి నీరు కాలువల ద్వారా కెనాల్‌లోకి ప్రవహించడంతో మళ్లీ రాకపోకలు ప్రారంభం అయ్యాయి.


కార్మిక రాజ్య స్థాపనే సిటు లక్ష్యం



పతాకావిష్కరణ చేస్తున్న రాజు, వెంకటరెడ్డి

డాబాగార్డెన్స్: కార్మిక రాజ్య స్థాపనే సిటు ప్రధాన లక్ష్యమని, అందుకు కార్మికులందరూ ఏకతాటిపైకి రావాలని సిటు సీనియర్ నాయకులు వై. రాజు, పి. వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిటు 56వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయం వద్ద నిర్వహించారు. ముందుగా పతాకావిష్కరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1970లో సిటు ఆవిర్భవించినట్లు తెలిపారు. ఇప్పుడున్న తరానికి ఆ సందర్భం తెలియక పోయినప్పటికీ మిగిలిన కార్మిక సంఘాలు యాజమాన్యాలకు ఎలా కొమ్ము కాస్తున్నాయి? ఉద్యమాలు నిర్వీర్యం చేయడానికి ఏ విధంగా ప్రయత్నిస్తున్నాయో వివరించారు. ఉద్యమానికి తూట్లు పొడిచేవి మిగతా కార్మిక సంఘాలేనని ఆరోపించారు. సిటు నాయకుడు ఎం. సుబ్బారావు నేతృత్వంలో నిర్వహించిన ఆవిర్భావ కార్యక్రమంలో జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు పోలేశ్వరరావు, సూరీడు, ప్రదీప్, మెడికల్ రిప్రజంటేటివ్ నాయకుడు సంజయ్‌కుమార్, రామారావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపు సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్



శిక్షణ పొందుతున్న విశాఖ క్రీడాకారులు

ఎంవీపీకాలనీ: సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జూన్ 1న ఎంవీపీకాలనీలోని అప్పుఘర్ ఎదురుగా ఉన్న పోలమాంబ ఫంక్షన్ హాలులో జరగనున్నాయి. ఈ మేరకు బ్రూస్ లీ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ చిన్నా ఓ ప్రకటనలో తెలిపారు. కొరియన్ చోటా ఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల కోసం జిల్లా బాలబాలికల జట్లను శుక్రవారం ఎంపిక చేశామన్నారు. 12 ఏళ్ల బాలికల విభాగంలో టి.తేజస్విని, 13 ఏళ్ల విభాగంలో జీవీ ఆరాధ్య, 16 ఏళ్ల విభాగంలో ఎస్.కావ్య, 17 ఏళ్ల విభాగంలో పి.సౌమ్య ఎంపికయ్యారు. 12 ఏళ్ల బాలుర విభాగంలో టి.తనుష్, 13 ఏళ్ల విభాగంలో సీహెచ్ మనోజ్ యాదవ్ ఈ పోటీలకు ఎంపికైనట్లు చిన్నా వెల్లడించారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు గౌరీప్రియ, వైభవ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు



కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చూస్తూ, వేదికల వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కాళీ మాత టెంపుల్ నుంచి భీమిలి వరకు ప్రధాన రహదారిపై యోగా వేదికలతో పాటు, మరో 25 అదనపు వేదికలను ఏర్పాటు చేయనున్నారు. ఈ వేదికల వద్ద తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్, హెల్ప్ కౌంటర్లు వంటి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏ ప్రాంతం వారు ఏ వేదికకు చేరుకోవాలి, వాహనాలు ఎక్కడ నిలపాలి వంటి వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధాన వేదిక మార్గంలో సుందరీకరణ, మరమ్మత్తులు, విద్యుదీకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల మధ్యలో చెట్ల కొమ్మలు తొలగించి, డివైడర్లకు, గోడలకు రంగులు వేయాలన్నారు. మత్స్యదర్శినికి రంగులు వేసి, పాడుపడిన భవంతిని కవర్ చేయాలని సూచించారు. డ్రెయిన్లను శుభ్రపరిచి, అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల్లో విద్యుదీకరణ, తాగునీరు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, హోర్డింగులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు పి. శ్రీలేఖ, సంగీత్ మాధుర్, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.